క్లుప్తంగా

అడివేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



రాజోళి: మండల కేంద్రంలోని భ్రమరాంబ అడివేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతా మూర్తులకు తుంగభద్ర నీటితో అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'వీరభద్ర వ్రతకల్పం' గ్రంథ ఆవిష్కరణ

నవాబుపేట: మండలంలోని లోకిరేవు గ్రామంలో ఆదివారం ఉమాపతయ్యస్వామి రచించిన వీరభద్ర వ్రతకల్పము గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ప్రధాన పూజారి లింగయ్యస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రంథావిష్కరణ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా డాక్టర్ చెన్నబసవ ప్రభు మహాస్వామి విచ్చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి దేవాలయ ఆవరణలో 108 మంది దంపతులతో సామూహిక వీరభద్రవ్రత కార్యక్రమం ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

అవన్నీ అసత్య ఆరోపణలు

కేటీదొడ్డి: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిపై పలువురు అసత్య ఆరోపణలు చేస్తున్నారని గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12న ధరూర్ మండల కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ కార్యక్రమంలో తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా అగౌరవపరచారని కొందరు సోషల్ మీడియాలో చేసిన నిరాధారణ ఆరోపణలు ఖండిస్తునట్లు తెలిపారు. ఎమ్మెల్యే మంచితనం, ఆదరణ ఓర్వలేక కొందరు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త గణేష్ గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అబ్రహం వారి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఐ, సీఐటీయూ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇటిక్యాల: మండల పరిధిలోని చాగాపురం, బుడ్డారెడ్డిపల్లి, శనగపల్లి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 33/11 కేవీ, చాగాపురం గ్రామ పరిధిలోని 33 కేవీ నూతన ఫీడర్ ఏర్పాటు చేయడం కోసం ఆయా గ్రామాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

మానవపాడు: మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో వాహన తనిఖీలను శుక్రవారం ఎస్ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణించరాదని సూచించారు. రోడ్డు నింబంధనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వకు సాగునీరు విడుదల



కేటీదొడ్డి: ర్యాలంపాడు ఆయకట్టు కింద సాగుకు నీరందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు గతంలో ఆందోళన చేపట్టిన నేపథ్యంలో కలెక్టర్ బీఎం సంతోష్ పొలాలను పరిశీలించి తక్షణమే నీటిని విడుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం 104 ప్యాకేజీ కాలువకు సాగునీరు విడదల చేశారు. కాలువలో సాగునీరు పారడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు.



గద్వాల స్టేడియంలో హోలీ వేడుకల్లో యువకులు, క్రీడాకారులు



హోలీ సంబురాల్లో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్



అయిజలో రంగులు పూసుకుంటున్న చిన్నారులు

హోలీ రంగుల కేళి

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణాలు, గ్రామాల్లో యువకులు, మహిళలు రంగులు చల్లుకుంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. రోడ్లపై ఉత్సాహంగా ఉల్లాసంగా కేరింతలు కొడుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని సంబరాలను జరుపుకున్నారు. బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా నృత్యాలు చేశారు. చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా రంగోళి ఆడారు. పలు చోట్ల కాముడి దహనం కార్యక్రమం నిర్వహించారు. హోలీ సందర్భంగా పలువురు నాయకులు ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

- గద్వాల జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి కామదహనాన్ని ఘనంగా నిర్వహించారు. క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.
- గట్టులో గురువారం అర్ధరాత్రి కాముడిని వీధుల్లో ఊరేగించి దహనం చేశారు. కమ్మరి వీధి, వాకిలిగేరి, కిందిగేరి, చేనేత కాలనీల్లో హోలీ ఆడారు.
- ధరూరు మండల కేంద్రంలో హోలీ పండుగ సందర్భంగా దుకాణ సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ చేశారు.
- కేటీదొడ్డి మండల కేంద్రంతో పాటు వెంకటాపురం, ఇర్కిచేడు, నందిన్నె, కుచినెర్ల, పాతపాలెం, వివిధ గ్రామాల్లో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. వీధివీధిన తిరుగుతూ స్నేహితులకు రంగులు చల్లుతూ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.
- మల్దకల్ మండల కేంద్రంతో పాటు అమరవాయి, మల్దకల్, తాటికుంట, నాగర్‌దొడ్డి, విఠలాపురం, ఎల్కూరు, బిజ్వారం గ్రామాల్లో యువకులు రోడ్లపై ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.
- అయిజ మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో హోలీ వేడుకలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. వృద్ధులు సైతం వేడుకల్లో పాల్గొన్నారు.
- అలంపూర్ నియోజవర్గ వ్యాప్తంగా సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.
- మానవపాడు మండల వ్యాప్తంగా యువత హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. ఆనందోత్సవాలతో కేరింతలు కొట్టారు.
- రాజోళి మండల కేంద్రం పచ్చర్ల, మాన్‌దొడ్డి గ్రామాల్లో హోలీ పండుగ ఘనంగా నిర్వహించారు. నృత్యాలు చేస్తూ సంబారాలు చేసుకున్నారు.
- ఉండవెల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో హోలీ ఘనంగా నిర్వహించారు. యువత, మహిళలు, చిన్నారులు సంబరాలు చేసుకున్నారు.
- ఎర్రవల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు రంగులను పూసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హోలీ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.



జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి రంగులు పూస్తున్న కార్యకర్తలు



ధరూరులో హోలీలో యువకులు



ఎర్రవల్లిలో హోలీ ఆడుతున్న చిన్నారులు



వెంకటాపురంలో హోలీ ఆడుతున్న చిన్నారులు



కేటీదొడ్డి పూజారి తండాలో హోలీ ఆడుతున్న యువకులు



గట్టులో హోలీ సంబరాలు



గట్టులో కాముడి దహనం

బకాయిదారులపై 'మున్సిపల్' కొరడా



నల్లా పైప్‌లైన్ తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అయిజ: పన్ను బకాయిలు చెల్లించని వారిపై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు మున్సిపల్ సిబ్బందితో కలిసి శుక్రవారం మున్సిపాలిటీలో ఇంటిపన్ను, నల్లా పన్ను, ఆస్తిపన్ను వసూళ్ల కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. శుక్రవారం బకాయిలు పేరుకున్న వారి ఇళ్ల వద్ద మిషన్ భగీరథ కుళాయిల పైప్‌లైన్లు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. ఈనెల 31వ తేదీ నాటికి ఆస్తిపన్ను చెల్లించని యెడల ఫెనాల్టీ విధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఓ లక్ష్మన్న, ఆర్ఐ విజయ్, బిల్ కలెక్టర్లు నరేష్, వీరేష్, రాకేష్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఇరువర్గాల ఘర్షణ



మద్యం మత్తులో దాడులకు పాల్పడుతున్న యువకులు

గద్వాల క్రైం: హోలీ పండుగా సందర్భంగా జిల్లా కేంద్రానికి చెందిన ఇరువర్గాల యువకులు మద్యం మత్తులో ఘర్షణ పడిన ఘటన జిల్లా కేంద్రంలోని నదీ అగ్రహారం (కృష్ణానది) సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసు కథనం మేరకు.. బీసీ కాలనీ, వడ్లవీధి, నదీ అగ్రహారం తదితర కాలనీలకు చెందిన యువకులు హోలీ జరుపుకుని కృష్ణానది సమీపంలో మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో మద్యం కాస్త ఇవ్వాల్సిందిగా కోరుతూ వాగ్వివాదానికి దిగడంతో ఆగ్రహించిన మరో వర్గీయులు దాడి చేశారు. దాడిలో లక్ష్మణ్ అనే యువకుడికి ఎడమ కంటి వద్ద గాయం కాగా మరో ఇద్దరు యువకులు సైతం తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన యువకులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో యువకులు మాజీ కౌన్సిలర్లు రజక నర్సింహులు, డీటీడీసీ నర్సింహులు చెందిన వారు కావడంతో పోలీసు స్టేషన్ సమీపంలో మరోమారు దాడులకు పాల్పడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి అల్లరిమూకలను చెదరగొట్టి స్టేషన్‌కు తరలించారు. దాడి ఘటనపై డీఎస్పీ మొగిలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు.

గోమాతకు విశేష పూజలు



ఎర్రవల్లిలో కుంకుమార్చన పూజలు చేస్తున్న భక్తులు



శాంతినగర్‌లో గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

శాంతినగర్: హోలీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గోమాతకు విశేష పూజలు జరిపించారు. గోప్రచార సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం అర్చకులు వినయ్‌కౌశిల్ శర్మ భక్తులచే పూజలు చేయించారు. ఈ సందర్భంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన, లలిత సహస్తనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం గావించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

కుంకుమార్చన పూజలు..

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రూప్స్‌లో మెరిశారు



హరికృష్ణ



నందకుమార్

మల్దకల్ : మండల కేంద్రానికి చెందిన దామ పద్మావతి, దామ వెంకటేశ్వర్లు కుమారుడు నందకుమార్ శుక్రవారం వెలువడిన గ్రూప్–3 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 67వ ర్యాంకు సాధించాడు. గతంలో వెలువడిన గ్రూప్–2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 255వ ర్యాంకు సాధించినట్లు నందకుమార్ తెలిపారు. ప్రస్తుతం నందకుమార్ గద్వాల మున్సిపాలిటీలో వార్డు అధికారిగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నందకుమార్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు.

433వ ర్యాంక్

అయిజ: మండల కేంద్రానికి చెందిన తెలుగు హరికృష్ణ గ్రూప్– 3లో ఫలితాల్లో 433 ర్యాంక్ సాధించినట్లు హరికృష్ణ తల్లిదండ్రులు తెలుగు దరెన్న, కిష్టమ్మ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు హరికృష్ణకు అభినందనలు తెలియజేశారు.

ముస్లింలకు ఇఫ్తార్

శాంతినగర్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు స్థానిక బ్రిక్స్ వ్యాపారి షేక్ హైదర్ గృహంలో శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. సుమారు 400 మంది ముస్లింలు విందులో పాల్గొన్నారు. రజాక్ మౌలానా, కలీముల్లా మౌలానాలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పౌర్ణమి సందర్భంగా పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రం, అలంపూర్ చౌరస్తాలోని ఆలయాల్లో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివార్లను ఊరేగింపు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, అర్చకులు ఆంజనేయశర్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

అయిజ: ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేసేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్వీ డిస్టిక్ కోఆర్డినేటర్ పల్లయ్య, ముక్తార్, వీరేష్, మత్తాలి, తులసి గౌడ్, మహేష్, వీరేష్ ఉన్నారు.

లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకోవాలి

అలంపూర్: విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకోవాలని పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ కేఎస్‌వీ రవి ప్రకాష్, హెచ్ఎం నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. బెస్ట్ స్టూడెంట్స్ ఆఫ్ ది ఇయర్, అకడమిక్ ఎక్సలెన్స్ పురస్కారాలను, సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో హెచ్ఎం నాగలక్ష్మి

మూగజీవాల దాహార్తి తీరేదెలా



చెన్నిపాడులో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

మానవపాడు: ప్రభుత్వం వేసవిలో మూగజీవాల దాహంతో అల్లాడకూడదన్న లక్ష్యంతో నీటితొట్టిలను నిర్మించింది. ఈ నేపథ్యంలో మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో నీటితొట్టిలు నిర్మించి నిర్వహణ లేక అధికారులు గాలికొదిలేశారు. ప్రస్తుతం గ్రామాల్లో నీటితొట్టిలు నిరుపయోగంగా ఉన్నాయి. చుక్కనీరు లేక మూగజీవాలు అల్లాడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలలో కంప్యూటర్ల ధ్వంసం

గట్టు: మండల పరిధిలోని మాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని కంప్యూటర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ వ్యవహారంపై హెచ్ఎం వెంకటేశ్వర్లు శుక్రవారం గట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం విధులు ముగించుకొని వెళ్లగా రాత్రి తలుపులకు ఉన్న తాళాలు పగులగొట్టి కంప్యూటర్లను ధ్వంసం చేసి, క్రీడా సామగ్రితో పాటు చిక్కీలను కూడా ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. గతంలోనూ పాఠశాలకు సంబంధించి నీటి మోటార్‌ను అపహరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం పేర్కొన్నారు.



మాచర్ల ఉన్నత పాఠశాలలో ధ్వంసం చేసిన కంప్యూటర్లు